నవతెలంగాణ 1
మెదక్
సోమవారం | 09 డిసెంబర్ 2024 | www.navatelangana.com

మంత్రిని కలిసిన పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలోని ఆయన స్వగృహంలో జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు ఆకుల మాణయ్య ఆదివారం కలిసారు. ఈనెల 11వ తేదిన సంగారెడ్డిలోని ఎల్ఎన్ ఫంక్షన్ హాలులో జరిగే తన కుమారుడి వివాహానికి హజరుకావాలని కోరుతూ పెళ్లి పత్రికను అందజేశారు. కాగా తప్పకుండా వివాహం, విందుకు హజరవుతానని మంత్రి తెలి పారు. మంత్రిని శాలువాతో సత్కరించి స్వీటు తినిపించారు. జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. డీఎస్‌పీ సత్తయ్య గౌడ్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డిలకు కూడా పెళ్లి పత్రికలను అందజేశారు.

గొర్రెల కాపరి తలపై నుంచి వెళ్లిన కారు

అక్కడికక్కడ మృతి..

నవతెలంగాణ-జోగిపేట

రోడ్డు పక్కల నిద్రిస్తున్న గొర్రెల కాపరి తలపై నుంచి కారు వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి అందోల్ మండలం కిచెన్ పల్లి, కుసంగి రోడ్డు మార్గమధ్యంలో చోటుచేసుకుంది. జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం.. గన్‌పూర్ మండలానికి చెందిన రామతీర్థం నాగరాజు(22) గొర్రెలు మేపుకుంటూ రాత్రి సమయంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో అందోల్ మండలం రామ్సన్‌పల్లి గ్రామానికి చెందిన వరదపాటి శ్రీకాంత్ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా, వేగంగా కారును నడుపుతూ నాగరాజు తలపై నుంచి తీసుకెళ్లాడు. తీవ్ర రక్తస్రావంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి తండ్రి బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట్ మండలంలోని ర్యాలమడుగు గ్రామ కారోబర్ బాల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసు కున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి బాల్ రెడ్డిని పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధామ్, గ్రామ పార్టీ అధ్యక్షులు మాణిక్ రెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్, బీసీ సంఘం యువత తాలూకా అధ్యక్షులు దత్తు కురుమ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మనూర్

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే డా పి.సంజీవ్ రెడ్డి ఆదివారం పంపిణి చేశారు. మండల కేంద్రమైన మనూర్ రైతు వేదికలో ఈ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దిగంబర్ రెడ్డి, దొండిరావు, బ్రహ్మానందరెడ్డి, బీరదార్ దత్తు, నారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అన్ని మతాల సారం ఒక్కటే..

నవతెలంగాణ-జహీరాబాద్

అన్ని మతాల సారం ఒక్కటే అని.. ఎవరైతే వారి మత గ్రంథాలను పూర్తిస్థాయిగా చదివి అర్థం చేసుకుంటారో.. వారు ఎక్కడైనా రాణించగలుగుతారని టీజీఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంఘం మండలంలోని కుప్పానగర్ గ్రామంలో ఆదివారం జరిగిన మస్జిద్ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రహీముద్దీన్ నూతనంగా మస్జిద్ నిర్మించిన సందర్భంగా వారిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు ముస్లిం మత పెద్దలు, మాజీ సర్పంచ్ ముల్తాని, ఖేజార్ ఖాన్, మొహమ్మద్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకలో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మెన్

నవతెలంగాణ-జహీరాబాద్

పార్టీ నాయకులు సిద్ధారెడ్డి వివాహ వేడుకలో డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో న్యాల్కల్ పార్టీ మండలాధ్యక్షులు రవీందర్, ఝరసంఘం మండలాధ్యక్షులు వెంకటేశం, కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మెన్ నర్సింహ గౌడ్, మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు రవీందర్, మల్గి మాజీ సర్పంచ్ మారుతి, మాజీ ఎంపీటీసీ శ్రీపతి, యువ నాయకులు ప్రవీణ్ పాటిల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారిపై కుక్కల దాడి

నవతెలంగాణ-చేర్యాల

చిన్నారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నారి తండ్రి శ్రీపతి కమలేష్ తెలిపిన వివరాల ప్రకారం తన కుమారుడు ఆదివారం ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. అటుగా ఒక్కసారిగా కుక్కల గుంపు వచ్చి దాడి చేయడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే జిల్లా కేంద్రం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామని తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని వాటిని వెంటనే అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.



బీఆర్ఎస్ శ్రేణులకు అండగా బీఆర్ఎస్

- దేశంలోనే అతిపెద్ద సభ్యత్వం కలిగిన పార్టీ బీఆర్ఎస్
- గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

బీఆర్ఎస్ శ్రేణులకు పూర్తి అండగా బీఆర్ఎస్ ఉంటుందని మాజీ ఎఫ్‌డీసీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి అన్నారు.గత కొన్ని రోజుల క్రితం పార్టీ కార్యకర్త చిక్కుడు కిరణ్ కుమార్ మరణిస్తే పార్టీ నుంచి ప్రమాద బీమా రూ,2 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం ఆయన అందజేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోనే దాదాపు.రూ 97,500 సభ్యత్వాలతో ఉండి అధికంగా సభ్యత్వాలు ఉన్న పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఎన్సి రాజమౌళి, వైస్ చైర్మెన్ జకీయుద్దిన్, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కేతకీ 'లడ్డూ'లో.. నాణ్యత డొల్ల!





- నాసిరకం వస్తువుల వాడకం..
- నాణ్యతను పాటించడంలో అధికారులు విఫలం
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు

నవతెలంగాణ-ఝరాసంగం

జిల్లాలోనే పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి ప్రసాదంలో నాణ్యత లోపించిందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుండి ప్రతీ అమావాస్య, ఆదివారం, సోమవారం, కార్తీక మాసం, శ్రావణమాసంతోపాటు ఇతర సెలవు దినాలలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. సంగమేశ్వర స్వామి ఆలయానికి ప్రతి ఏడాది వివిధ రూపాల్లో దాదాపు 4 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఆలయానికి ఇంత ఆదాయం వస్తున్న స్వామివారి ప్రసాదంలో వాడాల్సిన దినుసులు సరైన పరిమాణంలో వాడడం లేదని, నాణ్యత పాటించడం లేదని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


నాసిరకమైన వస్తువుల వాడకం?

లడ్డూ తయారీలో మార్కెట్‌లోని వేరు శనగ, ఇతర ప్రథమ శ్రేణి క్వాలిటీ వంట నూనెలు లేదా నెయ్యిని వినియోగించాల్సి ఉండగా ఇక్కడి అధికారులు మాత్రం పామాయిల్, అది కూడా చాలా తక్కువగా వాడుతున్నారు. శనగపిండి కూడా నాసిరకమైనదే ఉపయోగిస్తున్నారు. దీంతో లడ్డులో చక్కెర కూడా మిక్స్ కావడం లేదు. కిలో లడ్డూ తయారు చేసేందుకు జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి, పచ్చ కర్పూరం కూడా చాలా తక్కువ పరిమాణంలో వినియో గిస్తున్నారు. పులిహోర తయారీలోనూ రూల్స్?ను పాటిం చడం లేదు. నూనె, చింతపండు, ఎండుమిర్చి, మినపపప్పు, శనగపప్పు, జీలకర్ర, ఆవాలు, ఇంగువ, జీలకర్ర పొడి, మెం తుల పొడి తదితరాలు తగిన పరిమాణంలో నాణ్యమైనవి వాడటం లేదు. కానీ స్టాక్ రిజిస్టర్‌లో మాత్రం అన్ని వస్తు వులను వాడుతున్నట్లు నమోదవుతున్నాయి. ఇంతకీ ఈ సరు కులన్నీ ఏమైపోతున్నాయి? ఎవరి జేబులు భర్తీ అవుతు న్నాయి? లడ్డూలు, పులి హోర తయారు చేస్తున్న మహిళలు చేతులకు గ్లౌజ్‌లు, తలకు క్యాప్ కూడా ధరించడం లేదు. అందుకు నిదర్శనం గానే లడ్డులో తల వెంట్రుకలు వస్తున్నాయని ఓ భక్తుడు ఆవేదన వ్యక్తం చేశారు.

కానరాని నాణ్యతా పరీక్షలు..

ఆలయాల్లో తయారు చేసే ప్రసాదాలను దేవదాయ శాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సాధారణంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలి. ప్రసాదాలలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? దినుసులు వాడాల్సిన పరిమాణంలో వాడుతున్నారా? లేదా? మరేమైనా తక్కువగా వాడుతున్నారా? ప్రసాదాలు నిత్య అన్నదాన వంటశాలలు పరిశుభ్రంగా ఉంటున్నాయా? లేదా? వంట తయారు చేసే మనుషులు తలకు టోపీ, ఆప్రాన్లు ధరిస్తున్నారా? లేదా? వంటి అంశాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి ఏమైనా లోపాలు ఉంటే జరిమానా వేయడం వంటివి చేయాలి. కానీ గత పదేండ్ల నుంచి అలాంటివి చేసినట్టు కనిపించడం లేదు. శాంపిల్స్ ను ఎప్పటికప్పుడు పరీక్షకు పంపి తాజావా? నిల్వ ఉన్నవా? వాటిలో ఏమైనా బ్యాక్టీరియా ఉందా? వాటిలో ఏమైనా బ్యాక్టీరియా ఉందా? లడ్డు తయారికి వాడే టటువంట నూనె, నెయ్యి కల్తీవా? స్వచ్ఛమైనవా? వంటి పరీక్షలు చేసి నిర్ధారించాలి. కానీ అలాంటి దాఖలాలు ఆలయంలో కనిపించడం లేదు.

నా దృష్టికి రాలేదు..



లడ్డూ ప్రసాదంలో నాణ్యత తగ్గిందనే విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే ఆలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తా. భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్నే అందిస్తాం.

- శశిధర్, ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కారాములు

నవతెలంగాణ-మెదక్‌టౌన్



సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25 నుంచి 28 వరకు నాలుగు రోజుల పాటు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించడం జరుగుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో 3వసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామిక రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించాయన్నారు. విద్యా, వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షలా మారి, ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున పెరిగాయన్నారు. ప్రజలు చెమటోర్చి నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం అదానీ లాంటి బడా కార్పోరేట్ సంస్థలకు అమ్మేస్తుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులపై, రాష్ట్రాల హక్కులపై, రాజ్యాంగంపై పెద్ద ఎత్తున దాడి చేస్తుందన్నారు. పెట్రోల్, గ్యాస్, డిజిల్ ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందన్నారు. అదానీ కుంభకోణాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయకుండా అదానీని కేంద్ర ప్రభుత్వం కాపాడుతుందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, కార్మికులు, రైతులు అనేక ఆశలు పెట్టుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేయడంలో కాలయాపన చేస్తుందన్నారు. రైతులకు యాసంగి కూడా సమయానికి రైతు భరోసా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మహిళలకు రూ.2500లు ఆర్థిక సాయం వెంటనే అమలు చేయాలన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని ఆర్థిక, సామాజిక అంశాలు, కార్మికులు, కర్షకులు, పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొదటిసారిగా సంగారెడ్డి పట్టణంలో ఈ మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.మల్లేశం, బి.బసవరాజు, కె. మల్లేశం, బి. బాలమణి, ఎ.మహేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, కె.నాగరాజు, సంతోష్, అజయ్, కె.ప్రవీణ్, నాయకులు గౌరీ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవోను విడుదల చేయాలి

- రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



కార్మికులందరికీ కనీస వేతనాల జీవోను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ రాష్ట్రంలో కార్మిక వర్గ ప్రయోజనాలు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పి అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చింది. కానీ నేటికీ హామీలు నెరవేర్చే దాంట్లో వైఫల్యం చెందిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జరుగుతున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు జీతాలు పెంచి వారిని ఆదుకోవాల్సి ఉంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలజీవోను గెజిట్ చేసి దాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి స్కీం వర్కర్లకి చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆసంఘటితరంగా కార్మికులు గా పనిచేస్తున్న హమాలీ, రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్లకి వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవననిర్మాణ కార్మికులకి ఉన్న వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వ ఆధీనంలో ఉండే విధంగా చూడాలని కార్మికుల కష్టంతో వచ్చినటువంటి సెస్ డబ్బులను కార్మిక ప్రయోజనాల కోసమే ఖర్చు చేయాలన్నారు. సంఘటిత, అసంగటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలుతో పాటుగా ప్రమాద బీమా సౌకర్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని, 56 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి కార్మికుడికి పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వ కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నరసయ్య, సందింటి రంగారెడ్డి, మండల భాస్కర్, షఫిహమ్మద్, లింగంపేట ఎల్లయ్య, కొంపెల్లి భాస్కర్, పోతిరెడ్డి రాజు, బర్మా కొమురయ్య, లక్ష్మీ, విజయ, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ కృష్ణారెడ్డికి కామదేను-2024 అవార్డు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఆర్ కే.ఆర్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కాలేజ్ హైదరాబాద్, అతిథులు బండి శ్రీనివాస్, రఘువీర్ చైర్మెన్ ప్రైమ్ 9న్యూస్ వారి చేతుల మీదుగా సన్మానించి అవార్డును అందజేశారు.

కేజేఆర్ ఫౌండేషన్ అధినేత, ప్రముఖ సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డికి కామదేను-2024 అవార్డు లభించింది. వివిధ రంగాల్లో సేవ చేస్తున్న ప్రముఖులను గుర్తించి విశ్వ గురు వరల్డ్ రికార్డ్ వారి ఆధ్వర్యంలో కామదేను-2024 అవార్డులు అందజేస్తారు. అయితే బొల్లారం మున్సిపల్ ప్రాంతానికి చెందిన కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి నిత్యం ప్రజా శ్రేయస్సుకు పాటుపడుతున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వగురు వరల్డ్ రికార్డ్ సంస్థ వారు ఆయన సేవలు గుర్తించి.. హైదరాబాదులోని తెలంగాణ టూరిజం ప్లాజాలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద, సంస్థ ప్రతినిధులు డా. సత్యవోలు రాంబాబు, వ్యవస్థాపక సీఈవో విశ్వగురు వరల్డ్ రికార్డ్ కార్యక్రమ చైర్మన్ ప్రొఫెసర్ డా. సారంగపాణి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఆర్ కే.ఆర్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కాలేజ్ హైదరాబాద్, అతిథులు బండి శ్రీనివాస్, రఘువీర్ చైర్మెన్ ప్రైమ్ 9న్యూస్ వారి చేతుల మీదుగా సన్మానించి అవార్డును అందజేశారు. ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఈ అవార్డు అందుకున్నందుకు సంతోషంతో ఉన్నదన్నారు.

సంగారెడ్డి వరకు మెట్రోరైలును వేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి




సంగారెడ్డి వరకు మెట్రోరైలును వేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల విజయవంతం కోసం ఇంటింటికి సీపీఐ(ఎం) పేరుతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుండి జరిగే రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో సంగారెడ్డికి మెట్రో లైన్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిదంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని.. అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కృష్ణ, అశోక్, భూషణం విఠల్,ప్రసన్న, యాదగిరి ప్రభాకర్ మహేష్, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఒకరు.. పట్టా మరొకరికి

- కబ్జాకు ఉన్నా ధరణిలో సున్నా
- రెవెన్యూ అధికారుల తప్పిదంతో జంపయ్యకు ఇబ్బందులు
- న్యాయం చేయాలని వేడుకోలు

నవతెలంగాణ-అక్కన్నపేట



మండలం చౌటపల్లి గ్రామంలోని 312 సర్వే నెంబర్‌లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1970లో భూమి లేని నిరుపేదలకు ఆనాటి ప్రభుత్వం సాగు చేసుకోవడానికి ప్రభుత్వ భూమిని ఇచ్చింది. దీనిలో భాగంగానే రైతు ఇల్లందుల జంపయ్యకు 312/36 సర్వేనెంబర్‌లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టా అందించారు. అట్టి భూమిని సాగు చేసుకుంటూ జంపయ్య జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ భూమి పట్టా 2013 వరకు జంపయ్య పేరు మీదే ఉంది. కానీ కొంతమంది రెవెన్యూ అధికారులు 2014లో ఇట్టి పట్టాను తీసేసి అక్రమంగా ఆదిమూలపు రామస్వామి తండ్రి సాయన్న అనే వ్యక్తి పేరు మీద పట్టా చేశారు. ఉన్న రెండు ఎకరాల కంటే ఎక్కువగా అతని పేరుపై 5 ఎకరాల భూమి పట్టా చేసి చేతులు దులుపేసుకున్నారు. ఈ పట్టా చేసే సమయంలో కూడా భూమి చుట్టుపక్కల ఉన్నటువంటి రైతుల సంతకాలు కాకుండా ఇతర మండలాలకు చెందిన వ్యక్తుల సంతకాలు పెట్టి, తప్పుడు పత్రాలు సృష్టించి అతనికి పట్టా చేశారు.

-నా భూమి నాకు చేయాలి



గత 54 ఏండ్ల నుంచి ఈ భూమి దున్నుకుంటూ జీవిస్తున్నాను. కొంత మంది రెవెన్యూ అధికారులు నకిలీ పత్రాలు సృష్టించి, అసలు ఆ భూమికి సంబంధంలేని ఆదిమూలపు రామస్వామి పేరిట చేశారు. అంతేకాకుండా అతని పేరుపై ఇక్కడ ఉన్న భూమి కాకుండా 5ఎకరాల భూమి చేశారు. ఈ భూమిపై రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేసి, రామస్వామిపై ఉన్న ధరణి రికార్డులను తొలగించి, వ్యవసాయం చేసుకుంటూ బ్రతికే నాకు, అధికారులు న్యాయం చేయాలి.

-ఇల్లందుల జంపయ్య, చౌటపల్లి గ్రామ రైతు.

ప్రజా పోరాటాల సారధి సీపీఐ(ఎం)

- పార్టీ మహాసభల కోసం విరివిగా విరాళాలు ఇచ్చి బలపరచండి
- ఆందోల్ డివిజన్ కన్వీనర్ విద్యాసాగర్

నవతెలంగాణ-జోగిపేట



సీపీఐ(ఎం) ప్రజా పోరాటాల సారథి అని.. అలాంటి పార్టీ రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం విరివిగా విరాళాలు ఇవ్వాలని పార్టీ అందోల్ డివిజన్ కన్వీనర్ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. జోగిపేటలో ఆదివారం షాప్ టు షాప్ విరాళాల సేకరణ కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం పేదలు, కార్మికులు, ఉద్యోగులు కష్టజీవులు హక్కుల కోసం సీపీఐ(ఎం) పోరాడుతున్నదన్నారు. ప్రజాస్వామ్యం లౌకిక విధానం సామాజిక న్యాయం కోసం అంకితభావంతో ఉద్యమిస్తున్నదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం ఆందోల్ డివిజన్ లోని ఆయా ముఖ్యులు, శ్రేయోభిలాషులు, ఉద్యోగస్తులు, పార్టీ సానుభూతిపరులు, కార్మికులు, కర్షకులు విరాళాలు ఇచ్చి పార్టీ ఉద్యమానికి సహకరించాలన్నారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు ఈ మహాసభ నిర్ణయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులుసురేష్, శివ,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ వ్యర్థాలతో నీరు కలుషితం

నవతెలంగాణ-న్యాల్‌కల్



రాఘవపూర్-మాటూర్ శివారులో గోదావరి గంగా అగ్రో ప్రోడక్ట్ షుగర్ ఫ్యాక్టరీ కాలుష్యపు వ్యర్థాలతో నీరు కలుషితమవుతున్నదని స్థానికులు వాపోతున్నారు. రాఘవపూర్ శివారులో గల మత్తడి వాగులో నీరు కలుషితమై చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువులు కూడా ఆ నీరు తాగి రోగాల బారిన పడే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ కాలుష్యంపై ఉప తహసీల్దార్ రాజిరెడ్డి వివరణ కోరగా.. కాలుష్యం విషయం తమ దృష్టికి రాలేదని.. వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

తడిసి ముద్దవుతున్న పత్తి..

- అకాల వర్షాలతో పత్తిరైతు అయోమయం
- కండ్ల ముందే దెబ్బతింటున్న చేన్లు

నవతెలంగాణ-వట్‌పల్లి



పత్తి రైతులకు నష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న అకస్మాత్తు వర్షాలకు చేన్ల మీదున్న పంట మొత్తం తడిసి ముద్దవుతున్నది. ఈ ఏడాదైన దిగుబడి మంచిగా వచ్చి.. మంచి గిట్టుధర ఉంటుందని రైతులు ఆశపడ్డారు. కానీ నవంబర్ మొదటి వారంలో కురిసిన వర్షాలతో పంట మొత్తం దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిగిలిన పంటతో కనీసం పెట్టుబడైన వస్తుందేమో అని భావించారు. అదే సమయంలో కూలీల కొరత రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. కూలీల కొరతతో అష్ట కష్టాలు పడుతూ ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న పత్తి రైతులకు ఈ అకస్మాత్తు వర్షాలు మరింత నష్టాన్ని మిగిల్చుతున్నాయి. ఎకరాకు 10 నుండి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం6 నుంచి 8 క్వింటాళ్ల వరకు మాత్రమే వస్తుందని రైతులు చెబుతున్నారు. కలుపు మందులు పిచికారి మొదలుకొని ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు పెట్టినట్టు వాపోతున్నారు. తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని.. దళారులకు అమ్మితే రూ.6వేలకు మించి కొనే పరిస్థితి లేద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
సోమవారం | 09 డిసెంబర్ 2024 | www.navatelangana.com

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్, నిజాంపేట మండలాల్లోని కల్హేర్, కృష్ణాపూర్, బీబీపేట, మీర్ఖాన్ పేట, బాచేపల్లితో పాటు వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహానికి ఈ పథకాలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ పథకం దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు పోచయ్య, నిజాంపేట మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశం, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, తుకారం, రాధాకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు దేవదాస్, బేగరి జైలు, రాజేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్‌ను అభినందించిన మంత్రి



నవతెలంగాణ-మునిపల్లి

60 వేల మీటర్ల దారంతో తన చిత్రపటాన్ని వేసిన యువకుడిని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అభినందించారు. మండల పరిధిలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన మల్లికార్జున్‌పల్లి గ్రామానికి చెందిన దూదేకుల జహంగీర్.. మంత్రి దామోదర రాజనర్సింహ పుట్టినరోజు సందర్భంగా రాయికోడ్ మార్కెట్ కమిటీ సుధాకర్ రెడ్డి సహకా రంతో 60 వేల మీటర్ల దారంతో త్రెడ్ ఆర్ట్ వేసి మంత్రికి గిఫ్ట్‌గా.. సంగారెడ్డి చౌరస్తాలో ప్రదర్శించారు. దాంతో ఆదివారం రోజున జహంగీర్‌ను మంత్రి తన నివాసానికి పిలిపించుకొని 'శభాష్.. నీవు వేసిన ఆర్ట్స్ చాలా బాగుంది. నువ్వు ఇంకా ఎంతగానో ఎదగాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ మహేష్ కురమ, మైనారిటీ అధ్యక్షులు ఇస్మాయిల్ పటేల్, ఖలీం పాషా తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట్ మండలంలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన హరిసింగ్‌కు రూ.60,000 సీఎం సహాయ నిధి చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం అందజేశారు.హరిసింగ్‌కు ఆసుపత్రి వైద్య ఖర్చుల కోసం మంజూరైన చెక్కును స్వయంగా బాధితుడికి ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం హరిసింగ్‌ను పలకరించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధా మ్, గ్రామ పార్టీ అధ్యక్షులు మాణిక్ రెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్, బీసీ సంఘం యువత తాలూకా అధ్యక్షులు దత్తు కురుమ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల పరిధిలోని మోడల్ స్కూల్ గర్ల్స్ వసతి గృహంలో ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాధికారి గోవింద్ రెడ్డి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జి.పరమేశ్వరి తెలిపారు. ఖాళీగా ఉన్న ఒక కేర్ టేకర్, ఒక వార్డెన్, ఒక అటెండర్, ఒక ఏఎన్ఎం, ఒక హెడ్ కుక్, ఒక అసిస్టెంట కుక్, రెండు రాత్రి వాచ్మెన్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు వారం రోజుల్లో మాత్రమే ఆందోల్ కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తులను అందజేయాలన్నారు.



తాగునీటి బోరు మరమ్మత్తు అయ్యేనా?

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ గ్రామపంచాయతీలో తాగునీటి బోరు రిపేర్‌కు వచ్చి.. వారం రోజులైనా మరమ్మతుకు నోచుకోవడం లేదు. దాంతో తాగునీటిని తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల పంచాయతి అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో బోరు సమస్య పరిష్కారం అవ్వట్లేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి.. నీటి సమస్య పరిష్కరించే దృష్టి సారించాలని కోరారు.

సమగ్ర సర్వే చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-అమీన్‌పూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే నమోదుకు చివరి అవకాశంను ప్రజలందరూ సద్వినియోగం చేయాలని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి కోరారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలు, అన్ని కాలనీల వాసులు, గ్రేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్మెం ట్లు, ఇటీవల మున్సిపల్ లో విలీనమైన అన్ని గ్రామాల ప్రజలు కిష్టారెడ్డి పేట, పటేల్ గూడ,ఐలాపూర్, ఐలాపూర్ తండా, సుల్తాన్ పూర్,దయారా పరిధిలోని ప్రజలు సమగ్ర కుటుంబ సర్వే సమయంలో అందుబాటులో లేని వారు.. ఏదయినా కారణాలతో సర్వేలో వివరాలు నమోదు చేసుకోకుంటే.. 9885465065, 9963640541 నెంబర్లను సంప్రదించాలన్నారు. లేదా మీ ప్రాంతానికి వచ్చే ఎన్యూమరేటర్‌లను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా రాంచందర్ గుప్త



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు ముక్కాల రామచంద్రం గుప్త కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా గెలుపొందారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ..ఈ విజయం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీని మండల జిల్లా స్థాయిలో బలోపేతం చేస్తాన్నన్నారు. యువతను ఐక్యం చేసి సామాజిక మార్పు కోసం పార్టీ తరపున మరో చరిత్ర సృష్టిస్తానన్నారు. తన గెలుపునకు సంపూర్ణ సహకారం అందించిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా అభివందనాలు తెలిపారు.



కల్వర్టు పనుల్లో నాణ్యతా లోపం

నవతెలంగాణ-న్యాల్‌కల్

రాఘవపూర్-కుసునూరు శివారులో నిర్మిస్తున్న కల్వర్టు పనుల్లో నాణ్యత కొరబడిందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఎన్నో కోట్లు వెచ్చించి కల్వర్టులు నిర్మిస్తుంటే.. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నా యన్నారు. జిల్లా అధికారులు తరచూ తనిఖీలు చేపడితేనే పనులు నాణ్యంగా జరుగుతాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఆకట్టుకున్న సాధనాసురుల కళా ప్రదర్శన

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని లోపలికోట హనుమాన్ మందిర్ పద్మశాలి కులదైవం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాధనాసురుల కళ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఆదివారం లోపలికోట హనుమాన్ మందిర్ ముందర సాధనసురుల కళ ప్రదర్శన సుమారు రెండు గంటలపాటు సాగింది.అనంతరం లోపలికోట పద్మశాలి దైవం ఆధ్వర్యంలో సాధనసురులను ఘనంగా శాలువులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లోపలికోట హనుమాన్ మందిర్ పద్మశాలి కులదైవం సభ్యులు, మహిళలు పాల్గొని ప్రదర్శనను తిలకించారు.

అట్టహాసంగా ప్రారంభమైన యూటీఎఫ్ మహాసభలు

- హాజరైన ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ ఎమ్మెల్సీ ప్రొ.నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా 6వ మహాసభలు నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఎస్టిఎఫ్ఐ జెండాను అబ్దుల్లా, టీఎస్‌యూటీఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షులు కే.అశోక్ ఆవిష్కరించారు. మహాసభలను ప్రారంభించి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఉపాధ్యాయ నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పనను ఆహ్వానిస్తున్నామన్నారు. పర్యవేక్షక అధికారులు లేకపోవడం విద్యారంగ అభివృద్ధికి ఆటంకంగా మారుతుందన్నారు. కాబట్టి వెంటనే పర్యవేక్షక అధికారులైన డీఈఓ, డిప్యూటీ ఈవో, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి.. ఒక తరగతికొక ఉపాధ్యాయుడు ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. అర్బన్ ఏరియాల్లో జనాభా పెరిగి, కాలనీలు విస్తరిస్తున్న కూడా కొత్త పాఠశాలలు ప్రారంభించకపోవడం జరుగుతుందని, వెంటనే కొత్త పాఠశాలలను అర్బన్ ఏరియాల్లో ఏర్పాటు చేయాలనానర్రు. తద్వారా ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి విద్యారంగా పురోగతికి బాటలు వేస్తుందని, ఆ వైపుగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ బలోపేతం కోసం కృషి చేస్తున్నదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లా డుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. ఉపాధ్యాయుల సీపీఎస్ విధానం రద్దు చేయడం కోసం కూడా ప్రయత్నం చేస్తామన్నారు. అంతకు ముందు సదస్సులో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్య దర్శి వై.జ్ఞాన మంజరి, జిల్లా అధ్యక్షులు కే అశోక్ ప్రధాన కార్యదర్శి బి. సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు జే. కాశీనాథ్, ఎం. సువర్ణ, కోశాధికారి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు ఎం అమరేశ్వరి ఎం.శామయ్య బి. సాయి తేజ, ఐది ఏషప్ప, కే. కృష్ణమూర్తి, ఎం. నరేష్, ఏ. జగన్మోహన్, ఎం. నరసయ్య ,ఎండి. సంయోద్దీన్, వి .అనురాధ, ఎస్. ముకు ంద్, కృష్ణం రాజు, కే, సుదర్శన్ నారాయణఖేడ్ స్థానిక నాయ కులు హరి సింగ్,జేసుదాస్, విట్టల్, శ్రీరామ్ నాయక్, శివకు మార్, రవికుమార్, మాణిక్యం, కృష్ణకుమారి, హను మండ్లు, రాములు, నరసింహులు, రవీందర్ , స్వరూప రాణి, శశికళ, అరుణ తదితరులు పాల్గొన్నారు.





గ్రంథాలయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తా



నవతెలంగాణ-జహీరాబాద్

జిల్లాలోని గ్రంథాలయాలన్నింటిని మెరుగుపరిచి.. ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దామని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ జి.అంజయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం జహీరాబాద్ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో యువతను తీర్చిదిద్దే విధంగా అన్ని సౌకర్యాలతో కూడిన పాఠ్య సామాగ్రిని పొందుపరుస్తామన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను పరిశీలి ంచి, పాఠకులతో మాట్లాడి కావాల్సిన పుస్తకాల గురించి తెలుసుకున్నారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో గల సమస్యలన్నింటినీ పరిష్కరించి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. యువతీ యువకులు గ్రంథాలయాలను వినియోగించుకొని పోటీ పరీక్షలలో విజయం సాధించాలన్నారు.

నల్లవాగు ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల



నవతెలంగాణ-సిర్గాపూర్

మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పరిధిలోని 4వేల ఎకరాలకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదివారం సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నల్లవాగు ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలవల ద్వారా దాదాపు 4వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నా మన్నారు. అలాగే నల్లవాగు ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేసి.. ఇంకా ఎక్కువ ఎకరాలకు నీరు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. నల్లవాగు ప్రాజెక్టులో మత్స్య అభివృద్ధి, సెక్టార్ పథకం ద్వారా 100 శాతం రాయితీ పై చేప పిల్లలను ఇటీవలే విడుదల చేసినట్టు చెప్పారు. గత బీఆర్ఎస్ పాలకులు పదేండ్ల పాలనలో నల్లవాగు ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేవలం వారి పంటల కోసమే నీటిని విడుదల చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ్ రెడ్డి, గుండు నరేందర్, గుండు మోహన్, బండారి సాయిలు,శ్యామ్ ముదిరాజ్, జితేందర్ రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి తుకారం, వీరచరి, లక్ష్మయ్య, జైరాజ్, మోహన్ రెడ్డి, రాజేందర్ పాటిల్,ఈగ మోగులయ్య, జ్ఞానేశ్వర్ పాటిల్, మధు, నరస గౌడ్, గైనీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జా.. ఆపై అక్రమ కట్టడాలు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగుర్ల లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఎన్‌రిచ్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ యజమాన్యం దర్జాగా రోడ్డును కబ్జా చేయడమే కాకుండా అక్రమ నిర్మాణం చేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, జిల్లా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు పులుగూర్ల లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామికవాడలో ఎన్రిచ్ ఏరియాలోని సర్వేనెంబర్ 81, 84లలో ఎమ్మెస్ ఈబిజ్ పోర్టల్ లిమిటెడ్ పరిశ్రమ యజమాన్యం వారి స్థలం పక్కనే డెడ్‌ఎండ్ రోడ్డును కబ్జాచేసి గుట్టు చప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేశారన్నారు. గత మూడేండ్లుగా పరిశ్రమ యాజమాన్యం మున్సిపాలీకి హౌస్ నెంబర్ 15-1/3 పేరిట ఆస్తి పన్ను చెల్లించడం లేదన్నారు. రోడ్డు కబ్జాకు సంబంధించిన శాటిలైట్ చిత్రం కూడా ఉందన్నారు. పరిశ్రమ యాజమాన్యానికి మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు గురవుతున్న పారిశ్రామిక స్థలాలను కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులకు లేదా అని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కృషి డిఫెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో ఆదివారం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కాలనీలో జరిగిన సమావేశంలో ఎస్.అమరేందర్, జనరల్ సెక్రటరీ కె.ఎస్ జనార్దన్, ట్రెజరర్ పి.జోషి కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన పాలకవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎండీఆర్ ఫౌండేషన్ పృథ్వి, ప్యాక్స్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి, కాలనీ మాజీ అధ్యక్షులు మాణిక్య రెడ్డి, పాత పాలకవర్గం సభ్యులు శ్రీరాములు, బల్వంత, నారాయణ, అమరేందర్ రెడ్డి, కాలనీ పెద్దలు, కాలనీ వాసులు నూతన పాలకవర్గాన్ని అభినందించారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన అమరిందరు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలతో కాలనీ వాసుల సమన్వయంతో సమస్యలను పరిష్కరించడం తోపాటు కాలనీ అభివృద్ధిపరిచే విధంగా కృషి చేస్తానన్నారు.

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నాగిరెడ్డికి సన్మానం



నవతెలంగాణ-జహీరాబాద్

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో నియోజకవర్గ అధ్యక్షుడిగా గెలుపొందిన పట్లోళ్ల నాగిరెడ్డిని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్ల మెంటు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు.జహీరాబాద్ ఆదర్శనగర్ గల తన నివాసంలో పట్లోల నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వసిం, బబ్లూ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, జగదీశ్ రెడ్డి. శివ సాయి,అసెంబ్లీ ప్రధాన కార్యద ర్శులు మొయిన్, కార్తీకలను ఘనంగా సన్మానించారు. నియోజక వర్గంలోని యూత్ కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు కోహీర్ ముజామిల్, న్యాల్కల్ కిరణ్‌గౌడ్, మొగుడంపల్లి సుభాష్, జహీరాబాద్ సునీల్, ఝరా సంఘం రాఘవేంద్ర, జిల్లా, నియోజకవర, మండల కమిటీ నాయకులను సన్మానిం చారు. అనంతరం ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా కష్టపడిన యువజన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువతనే మొదటి మెట్టు అని.. యువత అనుకుంటే ఏదైనా చేయగలు గుతుందన్నారు. నియోజక వర్గంలోని ప్రతీ యువకుడు లీడర్ అవ్వడానికి తాను ఎల్లప్పుడూ తోడుగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల సీనియర్ నాయకులు మహమ్మద్ ముబీన్, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం



నవతెలంగాణ-కోహిర్, జహీరాబాద్

సైన్స్ ఎగ్జిబిషన్లో రాష్ట్రస్థాయిలో అవార్డు పొందిన ఉపాధ్యాయురాలిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోహిర్ ఎంఈఓ మహమ్మద్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. కోహిర్ మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ కావేలి ఉపాధ్యాయురాలు హాజర బేగం.. తన ప్రాథమిక స్థాయి నుంచి జీవశాస్త్రంలో ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎదిగి అక్కడ ఇన్‌స్పైర్‌లో రాష్ట్రస్థాయిలో అవార్డును సాధించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు తనలో ఉన్న ప్రతిభను బయటకు తీసి వాటిని తమ విద్యార్థులకు అందించాల న్నారు. అనంతరం విద్యార్థి మాస్టర్ మహమ్మద్ ముస్తఫాని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలిజబెత్ రాణి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎవరైతే తమ విద్యార్థులను తీర్చిదిద్దంలో ప్రావీణ్యాన్ని కనబరుస్తారో వారు ఎక్కడైనా రాణించగలుగుతారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎస్‌సిఈఆర్‌టి కార్యాలయం ద్వారా ఎన్ఐటి వరంగల్ లో జరిగిన విజ్ఞానమేళలో జాతీయస్థాయికి ఢిల్లీ పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాకేష్, శ్రీనివాస్, అశోక్, ఇలియ రాజ్ అహ్మద్, అబ్దుల్ హై, మహమ్మద్ రజియోద్దీన్, ఉజ్వల, సంగీత, బాబురావు, సురేఖ, అవార్డు గ్రహీత హాజర బెగం, మాస్టర్ మహమ్మద్ ముస్తఫాను సన్మానించారు.

బదిలీ చేశారు.. భర్తీ మరిచారు

- వట్‌పల్లి పీఎస్‌లో ఏఎస్ఐ, జమ్మేదార్‌ల కొరత



నవతెలంగాణ-వట్‌పల్లి

వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ, జమ్మేదార్ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. గతంలో పనిచేసిన వారిని బదిలీలు చేసిన అధికారు లు.. వారి స్థానాల్లో కొత్త వారిని నియమించడంలో జాప్యం చేస్తున్నారు. దాంతో ఏఎస్ఐ, జమ్మేదార్ కుర్చీలు వెలవెలబో తున్నాయి. అంతేకాకుండా పీఎస్ ఏర్పడినప్పటి నుంచి పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏనాడూ భర్తీ చేయలేదని.. తద్వారా స్టేషన్‌కు వెళ్లిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తు న్నారు. ఉన్న సిబ్బందే అదనపు బాధ్యతలు చేపడుతున్నారు. పీఎస్‌లో మొత్తం 21 స్టాఫ్ ఉండాల్సి ఉండగా.. అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. ఇటీవలే ఐదుమంది పురుషులు, ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్‌ను కేటాయించడంతో.. కొంత ఊరట లభించింది. కాగా గతంలో ఇద్దరు రైటర్లు ఉండగా 6 నెలల క్రితం ఒకరిని జోగిపేటకు బదిలీ చేశారు. దాంతో ప్రస్తుతం ఒక్కడే రైటర్ విధులు నిర్వహిస్తున్నారు. నలుగురు జమ్మేదార్లలో ముగ్గురు బదిలీపై వెళ్లగా.. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఇద్దరు ఏఎస్ఐలు ఉండగా రెండు నెలల క్రితం ఒకరు బదిలీపై వెళ్లారు. మిగిలిన ఒక్క ఏఎస్ఐ కూడా ఎస్సై ట్రెనింగ్ కోసం వెళ్లిపోవడంతో ఏఎస్ఐల రెండు స్థానాలు కూడా ఖాళీగానే ఉన్నాయి. 15 రోజుల క్రితం వరకు కూడా ఎస్సై పోస్టు ఖాళీగానే ఉండడం గమనార్హం. ఇంతలోనే ఇద్దరు ఏఎస్ఐలు, ముగ్గురు జమ్మేదారులు బదిలీపై వెళ్లడంతో స్టేషన్‌ను సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఏదైనా ఘటనకు సంబంధించి పంచనామా చేసేందుకు, స్టేషన్లో ఫిర్యాదు తీసుకోవడానికి కూడా సిబ్బంది కరువయ్యారని ప్రజల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

మండలానికి చేరుకున్న 108 అంబులెన్స్



నవతెలంగాణ-వట్‌పల్లి

వట్‌పల్లికి మండలానికి 108 నూతన అంబులెన్స్ ఆదివారం చేరుకుంది. మండల కేంద్రం ఏర్పాటైనప్పటి నుంచి 108 అంబులెన్స్ లేకపోవడంతో మండల ప్రజలు నానా అవస్థలు పడ్డారు. గర్భిణీలు పురుటి నొప్పులతో బాధపడుతున్న సమయంలో.. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో పక్కన గల రైకోడ్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, నారాయణఖేడ్, జోగిపేట పట్టణాల నుంచి ఇక్కడికి వచ్చేసరికి గంటన్నర టైం పట్టేది. అయితే మండల కేంద్రానికి 30 పడకల ఆసుపత్రి నిర్మాణంతోపాటు రెండు అంబులెన్స్‌లను కూడా మంజూరు చేస్తానని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఒక 108 అంబులెన్స్ ఆదివారం మండల కేంద్రానికి చేరుకున్నది. ఇచ్చిన హామీని నిలబట్టుకున్నందుకు మంత్రికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అంబులెన్స్ సిబ్బందికి సహకరించి సద్వినియోగం చేసుకోవాలని ప్రవీణ్, సంతు తెలిపారు.

వృద్ధ మహిళ అనాథాశ్రయానికి తరలింపు



నవతెలంగాణ-జహీరాబాద్

స్థానిక జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలలో గత కొన్ని నెలల నుంచి ఉంటున్న అనాథ మహిళను అనాథాశ్రయానికి తరలించినట్టు జహీరాబాద్ ఎస్సై కాశీనాథ్ తెలిపారు. గతేడాది నుంచి ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్‌లో గల చెట్టు కింద ఉంటూ యాచిస్తూ జీవనం గడుపుతున్న వృద్ధ మహిళ వివరాలు సేకరించాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వినతి మేరకు వివరాలను సేకరించారు. ఆ మహిళ..మరాఠీ భాషలో తన పేరు మంజుతాయి అని, మహారాష్ట్రలోని పండరిపూర్ ప్రాంతానికి చెందినదిగా, కుటుంబీకులే ఆస్తిని మొత్తం తీసుకొని ఆమెను వదిలేశారనట్టుగా చెబుతూ కుటుంబ వివరాలు పూర్తిగా తెలుప డా నికి నిరాకరించింది. దాంతో ఆమెను పోలీసు ఎస్కార్ట్‌తో అమ్మానాన్న హైదరాబాద్‌లోని అనాథాశ్రమానికి, తరలించారు.

వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి మండల వీరశైవ లింగాయత్ లింగ బలిజ మండల కమిటీని బుదేరా చౌరస్తాలో గల ఎల్లలింగ ఆశ్రవంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు మరెల్లి ధనంజయ, జిల్లా అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ , జిల్లా ముఖ్యసలహాదారు ఎం.బర్తప్ప ఆధ్వర్యంలో మునిపల్లి మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా న్యాలకంటి వీరన్న, అధ్యక్షులుగా పట్లోళ్ల వీరన్న, ప్రధాన కార్యదర్శిగా నీలం మల్లేశం, కోశాధికారిగా మల్లన్న, ఉపాధ్యక్షులుగా సతీష్ కుమార్, కోపూరి నవీన్ కుమార్, మండల కమిటీ యూత్ గౌరవాధ్యక్షునిగా గంగారం జ్ఞానేశ్వర్, అధ్యక్షునిగా అతినారం శేఖర్, ఉపాధ్యక్షులుగా బోడపల్లి నర్సింలు, సెక్రటరీగా రాయిపల్లి గోపాల్, జాయింట్ సెక్రటరీగా పట్లోళ్ల సుధాకర్, కోశాధికారిగా దుకాణం సంగమేశ్వర్ తదితరులు ఎన్నికయ్యారు.



2వ వార్డు ఆవుబోతుపల్లిలో మున్సిపల్ చైర్ పర్సన్ పర్యటన

- మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ



నవతెలంగాణ-మెదక్ డెస్క్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు ఆవుబోతుపల్లిలో మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆదివారం పర్యటన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆవుత్‌పల్లిలో పాత సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో నూతన సీసీ రోడ్డు వేయడానికి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించడానికి కృషి చేస్తానని తెలిపారు. రెండో వార్డ్‌లోని ప్రధాన దారిలో అంబేద్కర్ విగ్రహం వద్ద, యాదవ సంఘం కాలనీలో హైమాస్ట్ లైట్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి వెంకటరత్నాపూర్ వెళ్లే రహదారిలో ఉన్న హల్దీ వాగు డ్యామ్ వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని కూల్చివేసి, నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామ ప్రజలు మున్సిపల్ చైర్ పర్సన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డ్ కౌన్సిలర్ మామిడి వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేత మహేందర్ రెడ్డి, కొత్తపల్లి నర్సింగరావు, గుర్రం రాములు, బొగ్గుల శ్రీకాంత్, బొల్లు నాగులు, గుర్రం ఆంజనేయులు, నక్కలపల్లి వెంకటేష్, ఆవుబోతు కుమార్ పాల్గొన్నారు.

108లో ఉద్యోగ నియామకాలు



నవతెలంగాణ-నిజాంపేట

108 గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ నందు ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పైలెట్) పైలట్లకు అనగా అంబులెన్స్ డ్రైవర్ ఉద్యోగాలు నియామకాలకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా మేనేజర్ అఫ్రోజ్ పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలు సోమవారం నుంచి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో 108 ఆఫీస్ నందు నిర్వహించబడతాయన్నారు. ఇంటర్వ్యూలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయి. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు కావలసిన విద్యార్హత బీఎస్సీ లైఫ్ సైన్స్ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, డీఎంఎల్టీ, బిఫోర్మోన్సీఎం, ఏఎన్ఎం, జీఎన్ఎం, స్త్రీలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు, పైలెట్లకు అనగా అంబులెన్స్ డ్రైవర్లకు 108,102 అంబులెన్స్ డ్రైవర్లకు కనీస విద్యార్హత పదో తరగతి, డ్రైవింగ్ లైసెన్స్ బ్యాడ్జీ కలిగి ఉండవలెను. డ్రైవింగ్‌లో కనీసం మూడేండ్లు అనుభవం కలిగి ఉండవలెను అన్నారు. ఆసక్తి గలవారు ఈ నంబరుకు 9154918139, సంప్రదించగలరు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం

- మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్



నవతెలంగాణ-మెదక్ డెస్క్

తూప్రాన్ పురపాలక సంఘ పరిదిలోనీ అర్హులైన ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మున్సిపల్ వైఫ్ చైర్మన్ అందాల శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆయన ఆదివారం 13వ వార్డులో పర్యటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీకి ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకున్న వారి వివరాలు సేకరించి, అర్హులైన లబ్ధిదారుల ఇంటింటి వచ్చి వివరాలు సేకరిస్తామని తెలిపారు. సమగ్ర సర్వే చేస్తున్న అధికారుల పనితీరును పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. సర్వేలో ఎక్కడ అవకతవకలు జరగకుండా పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మమత, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనిపించని కల్లాలు.. రోడ్లపైనే వడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పోలీసుల నిబంధనలు ఉల్లంఘన
- ధాన్యం ఆరబోసేందుకు రైతులకు స్థలం కరువు
- రోడ్ల పక్కన వడ్ల కుప్పలతో ప్రమాదాలు
- నిధులు లేక ఆగిన కల్లాల నిర్మాణం పనులు



నవతెలంగాణ-కౌల్చారం

చేతికొచ్చిన ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. కౌల్చారం మండల వ్యాప్తంగా 21 గ్రామాలున్నాయి. ఇందులో వరి పంటను అధికంగా సాగు చేసే రైతులు ఎక్కువగా ఉండటంతో ధాన్యం ఆరబోసేందుకు స్థలాలు లేక రైతులు రోడ్ల పక్కన వడ్లను ఆరబోస్తుండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతుల ప్రయోజనం కోసం గత ప్రభుత్వం కల్లాలు నిర్మించుకోవడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా కొంత మేరకు నిర్మాణం పనులు చేపట్టింది. అంతలోనే నిధుల కొరత ఏర్పడటంతో సకాలంలో రైతులకు బిల్లులు అందక కల్లాలపై ఆసక్తి చూపలేకపోతున్నారు. ఒక్కో రైతు కల్లానికి రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. 50 స్క్వేర్ మీటర్ల కల్లం నిర్మాణానికి రూ.54 వేలు, 60 స్క్వేర్ మీటర్ల కల్లాల నిర్మాణం కోసం రూ.68 వేలు, 75 స్క్వేర్ మీటర్ల కల్లం నిర్మాణం కోసం రూ.80 వేలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. మండలం వ్యాప్తంగా 70 కల్లాల నిర్మాణానికి ఆమోదం లభించింది. గ్రామాల వారీగా అధికారులకు టార్గెట్లు విధించినప్పటికి మండలంలో పూర్తిస్థాయిలో కల్లాల నిర్మాణం జరగలేదు. కేవలం 20 నుంచి 30 కల్లాలు మాత్రమే నిర్మించినట్లు అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. కల్లాల నిర్మాణంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడం, నిధులు విడుదలలో జాప్యం కారణంగా ఎక్కడా కల్లాల నిర్మాణాలు కొనసాగడం లేదన్న ఆరోపణలున్నాయి.

నిలిచిన కల్లాల నిర్మాణం

గత ప్రభుత్వం చేపట్టిన రైతు కల్లాల పథకం అమలు నిలిచిపోయింది. కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌జీఎస్ పథకం కింద రైతు కల్లాల నిర్మాణాలకు నిధులు ఇవ్వలేదు. దీంతో మండలంలో కల్లాల నిర్మాణానికి బ్రేక్ పడింది. మండలంలో 70 కల్లాల నిర్మాణం జరగాల్సి ఉండగా కేవలం 20 శాతం మాత్రమే పూర్తయ్యాయి. అదేవిధంగా ఈసారి వర్షాలు విస్తారంగా కురియడంతో ధాన్యం దిగుబడులు అంచనాకు మించి పండినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ధాన్యం దిగుబడులు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 20 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయగా 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబోయడానికి కల్లాలు లేకపోవడంతో రైతులు రోడ్ల పక్కన రాశులను ఆరబోస్తున్నారు. ధాన్యం కల్లాల నిర్మాణానికి సంబంధించిన ముడి సరుకు రేట్లను సవరించడంతో పాటు, ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తే రైతులు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

పోలీసులు హెచ్చరిస్తున్నా మారని తీరు..

ధాన్యం ఆరబెట్టడానికి రైతులు రోడ్లనే ఆశ్రయిస్తుండటంతో ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. మెదక్ - నర్సాపూర్ జాతీయ రహదారిపై ధాన్యం విచ్చలవిడిగా ఆరబోశారు. అలాగే పోతంశెట్టిపల్లి నుండి జోగిపేట కు వెళ్లే ప్రధాన రహదారిపై ధాన్యం కుప్పలు ఉన్నాయి. అధికారులు, పోలీసులు హెచ్చరికలు చేస్తున్నా తీరు మారడం లేదు. పోలీసులు కూడా కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆయా ప్రాంతాలలోని ప్రధాన రోడ్లకు ఆనుకుని ఉన్న గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించి రోడ్లపై ప్రమాదకరంగా ధాన్యం ఆరబెట్టకుండా చూడాల్సిన ఆవశ్యకత కూడా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కల్తీ కల్లు.. ఆరోగ్యానికి చిల్లు

- క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్లతో కల్లు తయారీ
- మోతాదుకు మించి
- రసాయనాలు కలవడంతో ప్రమాదం
- పట్టించుకోని
- జిల్లా ఎక్సైజ్ అధికారులు
- మామూళ్ల మత్తులో జోగుతున్న వైనం





నవతెలంగాణ- పెద్ద శంకరంపేట్

మెదక్ జిల్లాలో 'కల్తీ' కల్లు మాఫియా రెచ్చిపోతోంది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి తయారు చేస్తున్న ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాల్సిన మెదక్ అబ్కారీ అధికారులు వారిచ్చే ముడుపులు పుచ్చుకుని కిమ్మనడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ఇటీవల పెద్దశంకరంపేటలో కల్తీ కల్లు తాగి నడవలేక రోడ్ల పైనే పడిపోతున్నారు. కల్తీకల్లు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి రోడ్డు ప్రమాదలకు గురువుతున్నారు. మోతాదుకు మించి రసాయనాలు కలిపి, కల్తీ కల్లును తయారు చేసి ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న కల్తీ కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్ శాఖ వారికి అండగా నిలుస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



బస్తీలే కల్లు కాంపౌండ్లకు అడ్డాలు

ప్రకృతి సిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యకరమైంది. స్వచ్ఛమైన ఈ కల్లును సేవించడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలు సైతం తొలగుతాయి. సాధారణంగా చెట్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట్ల కల్తీ తక్కువ డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడం అప్పటి వరకు ఈ వృత్తిపై ఆధార పడిన గీత కార్మికులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం ఫలితంగా కల్లుకు కొరత ఏర్పడింది. మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో రోజువారీ కూలీలు కృత్రిమంగా లభించే కల్లుకు అలవాటుపడుతున్నారు. ప్రజల్లోని ఈ బలహీన తను కొంత మంది కల్లు వ్యాపారులు సొమ్ము చేసుకుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోపామ్, ఆల్ఫాజోలమ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. తయారీలో మోతాదుకు మించి రసాయనాలను వినియోగిస్తుండడంతో దీన్ని సేవించిన వారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరు తున్నారు. మండలంలో ప్రతి గ్రామంలో రెండు కల్లు దుకాణాలున్నాయి. శివారు ప్రాంతాల్లో ఈ కల్తీ కల్లు విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిజానికి ప్రస్తుత సీజన్లో ఈత చెట్లకు ఆశించిన స్థాయిలో కల్లు ఉత్పత్తి కాదు. ఒకటి రెండు ఈత చెట్ల నుంచి కల్లును సేకరించినా ఇది వారి సొంత అవసరాలకు కూడా సరిపోదు. కానీ జిల్లాలోని ఏ ప్రధాన రోడ్డు వెంట చూసినా కృత్రిమ కల్లు దుకాణాలే దర్శనమిస్తు న్నాయి. ఎప్పటికప్పుడు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై అనేక విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ఒక లైసెన్సు రెండు దుకాణాలు

మండల కేంద్రంలో ఒకే లైసెన్స్‌పై రెండు కల్లు దుకాణాలు నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకే దుకాణంలో రెండు వేర్వేరు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఎక్సైజ్ నిబంధనల మేరకు ఒక లైసె న్సైపై రెండు విక్రయ కేంద్రాలు నడిపిస్తున్న విషయం తెలుసిన అబ్కారీ అధికారులు ఒక లైసెన్సైపై ఒకటే దుకాణం నడిపిచాలని హెచ్చరించారు. వ్యాపారులు మాత్రం ఇదేమి పట్టనట్టుగా దందా కొనసాగిస్తున్నారు. పెద్దశంకరంపేట నుంచి మల్యాపూర్ వెళ్తున్న క్రమంలో ఉన్న రోడ్డుపైనే కల్లు విక్రయాలు జరుపుతుండటంతో కాలనీ వాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదు.

నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది

డైజోఫాం ఇతర రసాయనాలతో తయారు చేసిన కృత్రిమ కల్లును సేవించిన వారిలో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. నీరసం, ఒంటి నొప్పులతో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. మానసిక వీక్షణ కోల్పోయి పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. ఈ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలకే ప్రమాదం, ఈ క్షతగాత్రులకు సర్జరీల సమయంలో నొప్పి నివారణ కోసం ఇచ్చే మత్తు ఇంజక్షన్లు సైతం పని చేయవు. మోతాదుకు మించిన కోసు ఇంజక్షన్లు ఇవ్వాల్సి వస్తుంది. సాధ్యమైనంత వరకు ఈ కల్లును సేవించక పోవడమే ఉత్తమం.

రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడల్లో యువత సత్తా చాటాలి

- 12వ వార్డులో వాలీబాల్ కోర్టును ప్రారంభించిన నర్సారెడ్డి



- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

నవతెలంగాణ-మెదక్ డెస్క్

వాలీబాల్ క్రీడల్లో యువత రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోన ఏటీఎస్ కాలనీలో 12వ వార్డులో నూతన వాలీబాల్ కోర్టును ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనాలని, దీంతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం దేహదారుఢ్యం వస్తుందని, క్రీడల్లో రాణిస్తే జిల్లా, రాష్ట్ర,జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులో క్రీడ ప్రాంగణాలు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్మెన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మెన్ నంద్యాల శ్రీనివాస్, కౌన్సిలర్ పల్లెర్ల రవీంద్ర గుప్తా, జమాల్పూర్ నర్సోజి, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అప్సర్, కాంగ్రెస్ నాయకులు నేత మహేందర్ రెడ్డి, విశ్వరాజ్, నాగరాజు గౌడ్, చిట్టిమిల్ల అనిల్, వెంకటేష్, క్రీడాకారులు నరేష్, ప్రసాద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు



బీసీల రాజ్యాధికారం కోసం రాష్ట్ర వ్యాప్త పర్యటన

- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్



నవతెలంగాణ-సిద్దిపేట

ఐక్యంగా ఉద్యమిస్తే రాజ్యాధికారాన్ని అట్టడుగు వర్గాల చేతిలో బహుమతిగా అందిస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజ్యాధికారం కోసం రాష్ట్రవ్యాప్త పర్యటన చేస్తున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ అన్నారు. స్థానిక మార్కండేయ దేవాలయంలో బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ముఖ్య నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు దాసు రామ్ నాయక్, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్ గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడకపోవడం వల్లనే అగ్రవర్ణాల అజమాయిషి కొనసాగుతుందని, అధికారం కోసం బీసీలు తిరగబడితే అనివార్యంగా అగ్రవర్ణాలు వారి కుర్చీలు ఖాళీ చేసే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. బీసీలు సమర్థమైన నాయకులను తయారు చేసుకోకపోవడం, నిర్ణయాలు జరిగే అసెంబ్లీ, పార్లమెంటుల్లో ఈ వర్గాలు లేకపోవడం వల్లనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. యువత, మహిళలు రాజకీయాల్లోకి రానంతవరకు ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగుతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, అన్ని జిల్లాల్లో నాయకత్వ నిర్మాణాన్ని చేపట్టామని, యువ నాయకులను, మహిళలను ప్రోత్సహిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారిని పోటీకి దింపనున్నామన్నారు. ఎటువంటి ప్రాతిపదిక లేకుండా అశాస్త్రీయంగా, అన్యాయంగా పార్లమెంటులో అగ్రవర్ణ ఆధిపత్య పార్టీల ఆమోదంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు దొడ్డిదారిన పార్లమెంటులో ప్రవేశించాయన్నారు. 8 లక్షల పైబడిన సంపాదన ఉన్న బీసీ వర్గాలను క్రిమి లేయర్‌గా అభివర్ణిస్తు వారిని రిజర్వేషన్లకు దూరం చేస్తూ, ఆ సంపాదన ఉన్న అగ్రవర్ణ విద్యార్థులను మాత్రం కేంద్ర ప్రభుత్వం పేదవారుగా పరిగణించడం ఏ మేరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీసీ నాయకులు ప్రొఫెసర్ కృష్ణ దయాసాగర్, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, రాములు, రాష్ట్ర సిద్దిపేట జిల్లా పద్మశాలి నాయకులు గూడూరు శ్రీనివాస్, ముదిగొండ శ్రీనివాస్, పాల్గొన్నారు.

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాయికుమార్ గౌడ్



నవతెలంగాణ-వర్గల్

యూత్ కాంగ్రెస్ వర్గల్ మండల అధ్యక్షుడిగా తునికి ఖల్సా గ్రామానికి చెందిన పంజాల సాయికుమార్ గౌడ్ ఘనవిజయం సాధించారు. ఆగస్టు నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ నాయకుల ఎన్నికలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్‌కి చెందిన ప్రత్యేకమైన మొబైల్ అప్లికేషన్ ద్వార ఎన్నికలను కొనసాగాయి. ఈ అప్లికేషన్ ద్వార యూవత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా ఉన్నటువంటి 27 గ్రామాల యూవత ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. వర్గల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవికి ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండగా ఇటీవల ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో తునికి ఖల్సా గ్రామానికి చెందిన పంజాల సాయి కుమార్ గౌడ్‌కి 2067 ఓట్లు పోలయ్యాయి. సమీప అభ్యర్థి పై 700 ఓట్ల మెజారిటీ తో ఘనవిజయం సాధించారు. పంజాల సాయికుమార్ గౌడ్ ఇటీవల కాంగ్రెస్‌లో చురుకుగా పొల్గొంటు యూవతతో కలసి పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంటా నర్సారెడ్డి ఆశీర్వాదంతో యువతలో మంచి గుర్తింపు పొందారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికలో తనదైన ముద్రను వేస్తూ గెలుపొందారు.

-యువత పురోగతి లక్ష్యంగా పనిచేస్తాను



నా పై నమ్మకంతో నన్ను గెలిపించిన యూవతకు రుణపడి ఉన్నాను. నాకు సంహరించి, ముందుండి నడిపిన పార్టీ పెద్దలు, 27 గ్రామాల యువత నమ్మకాన్ని నిలబెట్టేలా పార్టీ అభివృద్ధికై సర్వశక్తులా కృషి చేస్తాను. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి చేరేలా, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహనా కల్పిస్తూ అందరికీ అందేలా కృషి చేస్తాను. మండల వ్యాప్తంగా ఉన్నటువంటి యువతతో కలసి పార్టీకి నా సేవలను అందిస్తాను.

-పంజాల సాయి కుమార్ గౌడ్
-వర్గల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు

నవతెలంగాణ
సిద్దిపేట
సోమవారం | 09 డిసెంబర్ 2024 | www.navatelangana.com

భారీ వర్షం తడిసిన ధాన్యం



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయిందని బీజేపీ సీనియర్ నాయకుడు రైనా నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని పంతులు తండా గ్రామంలో కల్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం ఆరబోసుకోవడానికి సరైన స్థలాలు చూపించకపోవడం వల్లే ఇలా జరుగుతుందన్నారు. అంతేకాకుండా కొనుగోళ్ళు కూడా నెమ్మదిగా జరుగుతున్నాయని, కొనుగోలు సెంటర్లలో టార్పాలిన్ కవర్లు లేకపోవడం వల్ల వడ్లన్నీ వర్షార్పణమయ్యాయని తెలియజేశారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లేనియెడల కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో పర్మిషన్ లేకుండా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో అనేక కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు స్థానిక విద్యాశాఖ అధికారుల పర్మిషన్లు లేకుండా అక్రమంగా నడుపుతున్నారు. వాటిని తనిఖీలు చేసి, సీజ్ చేయాలని, లేని పక్షాన సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐగా తనిఖీలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుళ్ల మృతి బాధాకరం..



- మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్

ఎంతో భవిష్యత్తు ఉన్న పోలీస్ కానిస్టేబుళ్ల మృతి బాధాకరమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో జాలిగామ బైపాస్ రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్టేషన్లో పనిచేస్తున్న వెంకటేశం, పరంధాములు మరణించడంతో రాజమౌళి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వారి మృతదేహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువురు కానిస్టేబుళ్లపై ఆధారపడ్డ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కానిస్టేబుల్ కుటుంబాల భార్యా పిల్లలను ఓదార్చి సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో కౌన్సిలర్ చందు ఉన్నారు.

రద్దు చేయించి..చిత్తశుద్దిని చాటాలి

- ఎమ్మెల్యేకు బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు మహేశ్ విజ్ఞప్తి



నవతెలంగాణ-బెజ్జంకి

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ఇథానాల్ పరిశ్రమను రద్దు చేసినట్టు, మండలంలో గుగ్గిల్ల, పోతారం గ్రామ శివారుల్లో నిర్మిస్తున్న ఇథానల్ పరిశ్రమలను రద్దు చేయించి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలపై చిత్తశుద్దిని చాటాలని బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు చాతవేణి మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇథానాల్ పరిశ్రమల వల్ల భవిష్యత్తులో మండలంతో పాటు మండలేతర గ్రామాలకు ముప్పేనని ప్రభుత్వం పరిశ్రమలను రద్దు చేసేల ఎమ్మెల్యే కృషి చేయాలని మహేశ్ కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుంటక శ్రీనివాస్ సోదరుడు గుంటుకు గోపి అనారోగ్యంతో శనివారం మరణించటంతో మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులు గుండె ధైర్యంతో ఉండాలని మనోధైర్యం ఇచ్చారు.

-కానిస్టేబుళ్ల కుటుంబాలకు...

హైదరాబాదుకు మారథాన్ క్రీడలకు వెళ్తున్న దౌల్తాబాద్, రాయపోల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న వెంకటేశం. పరంధాములు మరణించటంతో వారు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు.

డంపింగ్ యార్డ్ మర్చి.. చెరువులో చెత్త డంపింగ్

- కలుషితమవుతున్న బేగంపేట ఊర చెరువు
- పంచాయితీ కార్యదర్శి తీరుపై అసహనం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డ్ మర్చి.. సేకరించిన చెత్తను ఊర చెరువులో డంపింగ్ చేస్తుండడంతో స్థానిక ముదిరాజ్ కులస్తులు ఆదివారం పంచాయతీ కార్యదర్శి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఊర చెరువులో చెత్త డంపింగ్ చేయడంతో నీరు కలుషితమై చేపలు మృత్యువాత పడుతాయని ముదిరాజ్ కులస్తులు అవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శికి విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఊర చెరువులో చెత్త డంపింగ్‌పై పంచాయతీ కార్యదర్శి క్రిష్టారెడ్డి వివరణ కోరగా చెత్తను తొలగించేల చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సీఎం కప్పు క్రీడకారులకు క్రీడా దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్పు క్రీడాకారులకు క్రీడ దుస్తులను బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ మర్కుక్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటముల సహజమన్నారు .యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట రాములు, మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, సీఎం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, క్రీడాకారులు సంతోష్, ప్రవీణ్, పాపోల్ల బాలరాజు, మహేశ్ రెడ్డి, తదితరులున్నారు.



నైరాశ్యంలో మండల కాంగ్రెస్



- మండల కాంగ్రెస్ శ్రేణుల్లో అంతర్గత విభేదాలు..
- ఎవరికి వారే యమునా తీరే
- ఎన్నికలు దగ్గరపడుతున్న మారని వర్గ విభేదాలు
- మండల నాయకుల తీరుపై కాంగ్రెస్ శ్రేణుల్లో విమర్శలు

కాలం కలిసి రాకపోతే ఎంత కష్టపడిన ఉపయోగం ఉండదు. కలిసి వచ్చిన కాలాన్ని వినయం, విజ్ఞతతో వినియోగించుకోవడం అంతే ముఖ్యం. రాజకీయాల్లో నేతలకు కష్టమే కాదు..అదృష్టం కూడా వరించాలి.. అప్పుడే ప్రజల్లో సుస్థిర స్థానం నిలదొక్కుకుంటారని పలువురు వాపోతున్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు మార్చుకుని సైతం బరిలో నిలుస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా..ప్రజల్లో తమ పార్టీ పరిస్థితులను పట్టించుకోవడం లేదనే వదంతులు వినిపిస్తున్నాయి. మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికవ్వడం కొంత మంది కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిన..మరికొంత మంది శ్రేణుల్లో నిరుత్సాహాన్ని నింపిందని పలువురు వాపోతున్నారు. మండల కాంగ్రెస్ శ్రేణుల మధ్య నెలకొన్న అంతర్గత వర్గ విభేదాలు ఎన్నికల సమయానికి మరింత తారాస్థాయికి చేరనున్నాయని సమాచారం. మండల కాంగ్రెస్‌లో ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా కొందరు నాయకులు వ్యవహరించడం సొంతోళ్లతోనే పార్టీకి ముప్పు తప్పదని చర్చించుకుంటారు. పార్టీలో నెలకొన్న విభేదాలను సక్కదిద్దుకుని ముందుకు వేళ్తేనే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు సానుకూల పరిస్థితులు సుగమమవుతాయని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

రానున్న స్థానిక ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం ఎన్నికలకు సమాయత్తమ వుతోంది. మండలంలోని సొంత పార్టీ నాయకుల అత్యుత్సహంతో అధిష్టానం లక్ష్యానికి ముప్పు తప్పని పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ పార్టీ వర్గీయులు చెబుతున్నారు. మండల ప్రజల్లో కాంగ్రెస్‌కి సానుకూలత ఉన్న నాయకుల తీరువల్ల నీరుగారుతోందని విమర్శలను కూడగట్టుకుంటున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వ్యవహరి స్తున్న తీరు పలువురి కాంగ్రెస్ శ్రేణులకు అస్సలు మింగుడు పడడంలేదనే ఉహగానాలు వినిపిస్తున్నాయి. కాంగ్రె స్‌లో తలెత్తిన వర్గ విభేదాలు ఎక్కడివక్కడే ఉండడం..సమీక్షా నిర్వహించి విబేధాలను పరిష్కరించే ప్రయత్నం చేయకపోవడం పలువురి పార్టీ శ్రేణులను మరింత నైరాశ్యానికి గురిచేస్తోంది. ఎన్నో ఎండ్లుగా కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలో పనిచేసిన శ్రేణులను విస్మరించి. .ఇటీవల చేరిన పలువురికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సముచిత ప్రాధాన్యత ఇవ్వడం కాంగ్రెస్ శ్రేణులను తీవ్ర విస్మయానికి గురిచేస్తుందని గోడు వెల్లబోసుకుంటున్నారు.

కవ్వంపల్లి తీరుపై సర్వత్రా విమర్శలు..

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న మండలంలోని కాంగ్రెస్‌లో తలెత్తిన వర్గ విబేధాలను పరిష్కరించి ఏకతాటిపైకి తీసుకువచ్చే విధానంలో అలసత్వం వహిస్తుండడం, తనకు అనుకూలంగా వ్యవహరించే వారినే అక్కున చేర్చుకోవడం వంటి పరిణామాలు కలిచి వేస్తున్నాయని శ్రేణుల్లో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కవ్వంపల్లి వ్యవహరిస్తున్న తీరు రానున్న స్థానిక ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనుందని పలువురు మాట్లాడుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి తమదైన శైలిలో అహర్నిశలు పని చేసిన పలువురు మండల కాంగ్రెస్ శ్రేణుల నుంచి పార్టీకి కష్టాలు ఎదురవ్వక తప్పవని పలువురు కాంగ్రెస్ శ్రేణులు వాపోతున్నారు.

సమన్వయంతో పని చేస్తున్నాం



నాటి నుంచి కాంగ్రెస్ బలోపేతానికి మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ నేటికి శాయశక్తుల కృషి చేస్తు న్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుంది. రానున్న ఎన్నికల్లో సమన్వయంతో పని చేస్తాం.

-ముక్కీస రత్నాకర్ రెడ్డి, మండలాధ్యక్షుడు, బెజ్జంకి

ప్రజా సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్

నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ గత ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభు త్వానికి ఉందన్నారు. గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రభుత్వంలోని అభివృద్ధి చెందిందని అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుం ట నర్సారెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పలాలు ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. రుణమాఫీ రైతులకు ఎంతో మేలు చేసిందన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటుందని రైతులకు సూచన సలహాలు ఇస్తామన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ అధికారులు, మార్కెట్ కమిటీ చర్యలు తీసుకుంటు న్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ డైరెకర్ నరసింహ రెడ్డి, వహీద్ పాల్గొన్నారు



ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని శివారు వెంకటపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూం వద్ద నీటి ఎద్దడి నెలకొంది. ఈ సమస్య బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య దృష్టి గ్రామ ప్రజలు తీసుకెళ్ళారు. దీంతో ఆయన ఇటీవల బోరు బావి తవ్వించారు. ఆదివారం ఆయన బోరు బావిలో మోటరను ఇప్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చిన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పుట్ట కిష్టయ్య, ఇస్తారి, భాస్కర్, మల్లేశం, సత్యయ్య ప్రవీణ్, అశోక్, యాదగిరి, బాలయ్య రాజు, ఇస్తారి, కర్ణాకర్, కిష్టయ్య, కాలనీ వాసులు తదితరులున్నారు.



ఆరు గ్యారంటీలు.. అరవైఆరు మోసాల కాంగ్రెస్

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభూషణ్ రెడ్డి

నవతెలంగాణ-రాయపోల్

రాష్ట్రంలో కాంగ్రెస్ గ్యారంటీల గారడీ ఆరు గ్యారంటీలు అరవైఆరు మోసాలతో ప్రజలను మభ్య పెడుతుందని ఏం సాధించారని విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నారని బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి భూరెడ్డిగారి విభీషణ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అనాజీపూర్ గ్రామానికి చెందిన గడ్డం యాదగిరి రూ.60 వేలు, రాంసాగర్ గ్రామానికి చెందిన కే.మహిపాల్ రూ.22 వేల సీఎం సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అలాగే కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రజలకు ఇచ్చిన అబద్దాల హామీలతో రైతు లను, మహిళల ను, నిరుద్యోగుల ను, ఉద్యోగులను మోసం చేసి ఈ రోజు విజ యోత్సవ సభలు చేసు కో వడం విడ్డూ రంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాయపోల్ మండల అధ్యక్షులు రాజాగారి రాజాగౌడ్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ మోర్చా ఇన్చార్జి మంకిడి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి, బీజేవైఎం మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షులు నామసాని స్వామి, కొండారి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీకి ఘన సన్మానం



నవతెలంగాణ-నంగునూరు : కాంగ్రెస్ యువజన ఎన్నికల్లో సిద్దిపేట యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన సాదుల పవన్ కుమార్‌ను మండలంలోని పాలమాకుల గ్రామంలో ఘనంగా సన్మానించారు. మండల వైస్ ప్రెసిడెంట్ రంగు అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజ్ బహదూర్ రెడ్డి హాజరై మండల యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ సాయి శ్యామ్‌ను సైతం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్ బహదూర్ రెడ్డి మాట్లాడుతూ నవ భారత నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరించాలని అన్నారు. రంగు అశోక్ గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిప్పని రాజేశ్, కరుణాకర్ రెడ్డి, సంద బోయిన తిరుపతి, శ్యామ్ రెడ్డి, బసవరాజు శ్రీనివాస్, రాంపూర్ శ్రీనివాస్ గౌడ్, సతీష్ ముదిరాజ్, సంపత్ రెడ్డి, కటం కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ యువతి వివాహానికి ఆర్థిక సాయం



- మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

అనాథ యువతి వివాహానికి ఆర్థిక సాయం అందించడం తమ వంతు బాధ్యతగా భావించానని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆందోలు ఆలేఖ్య అనే యువతి వివాహానికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయి చిన్న వయసులోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించారన్నారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో వివాహం ఖర్చులకు యువతికి రూ. 10 వేలు అందిచ్చామన్నారు. ఈ సందర్భంగా యువతి సంరక్షకులు కష్ట సమయంలో మాకు సహాయం చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మద్ది రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ చాడా శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో అప్షన్ అహ్మద్, నిజామోద్దీన్, నాయకులు, తదితరులు ఉన్నారు.

కరాటేలో సెయింట్ జోసఫ్స్ అత్యుత్తమ ప్రతిభ

- 6 బంగారు, 9వెండి, 4 రజత పథకాలు
- క్రీడాకారులను అభినందించిన కరాటే మాస్టర్ శ్రీను

నవతెలంగాణ-బెజ్జంకి: హన్మకొండ కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్ 24-25లో మండల పరిధిలోని బేగంపేట గ్రామంలోని సెయింట్ జోసఫ్స్ పాఠశాల కరాటే విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 19 పథకాలు సాధించినట్టు ఆదివారం కరాటే మాస్టర్ దేవులపల్లి శ్రీను తెలిపారు. భాను ప్రకాశ్, అనుకృతి, ఆరాధ్య, శీరి హర్షిణి, అవినాష్, లోకేశ్(బంగారు), శివాజ, శివ, ఆర్యన్, తేజస్విని, రితిక, మనోజ్ కుమార్, సాకేత్, మౌనిక, విఘ్నేశ్వర్ రెడ్డి(వెండి),వినయ్, వర్షికా, మోహనాథ్ రెడ్డి, సాయి రక్షిత(రజత)పథకాలు సాధిం చారని శ్రీను తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పథకా లు సాధించిన విద్యార్థులను పాఠశాల సిస్టర్ షాలిని, బోధన సిబ్బంది, కరాటే మాస్టర్ వైష్ణవి అభినందనలు తెలిపారు.



యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా అనిల్ గౌడ్



నవతెలంగాణ-రాయపోల్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన యూత్ కాంగ్రెస్ ఆన్లైన్ ఎన్నికలలో సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా మండలంలోని అనాజీపూర్ గ్రామానికి చెందిన యువ నాయకులు అన్ని బయిన అనిల్ గౌడ్ ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నర్సారెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి, తన వంతు కృషి చేస్తానన్నారు.సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ పార్టీ కమిటీలు వేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు పార్టీనీ మరింత బలోపేతం చేసి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితని కలిసిన కొమ్ము నవీన్ కుమార్



నవతెలంగాణ-ములుగు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితని చాలా రోజుల తర్వాత మర్యాదపూర్వకంగా కలిసానని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి కొమ్ము నవీన్ కుమార్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్నా పరిణామాల గురించి చర్చించామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేదాక బీఆర్ఎస్ వెనకడుగు వేయదని, ఎప్పుడైనా ప్రజల పక్షంగానే పనిచేస్తూ ముందుకు పోతుందని చెప్పారన్నారు. ప్రజలకైన బీఆర్ఎస్ కార్యకర్తలకైనా ఎల్లవేళలా అండగా ఉంటూ ముందుకు సాగుతుందని అన్నారు.

నార్కటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు



నవతెలంగాణ-చేర్యాల

గంజాయి, మత్తుపదార్థాల బారిన పిల్లలు పడకుండా తల్లిదండ్రులు కనిపెట్టాలని చేర్యాల ఎస్ఐ పీ.నీరేశ్ అన్నారు. గంజాయి, మత్తుపదార్థాల నివారణ గూర్చి మండల కేంద్రం తోపాటు మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో ఆదివారం నార్కటిక్స్ డాగ్స్‌తో అనుమానస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పాన్ డబ్బాలు, కిరాణా షాపులతోపాటు చుంచనకోట గ్రామంలోని అనుమానాస్పద ప్రదేశాల్లో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా లేక అక్రమంగా రవాణా చేసిన పాన్ షాపులలో కానీ ఇతర షాపులలో అమ్మిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి, మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా విక్రయించినా వెంటనే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

సాంప్రదాయ రచనలకు శ్రీకారం చుట్టాలి



నవతెలంగాణ-సిద్దిపేట

కవులు, రచయితలు సాంప్రదాయ రచనలతో ముందుకు సాగాలని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐతా చంద్రయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన జాతీయ సాహిత్య పరిషత్ కార్యవర్గ సమావేశంలో పార్వతీపురంకు చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన దృశ్యభాష కవితా సంపుటిని పరిచయం చేస్తూ చంద్రయ్య మాట్లాడుతూ భాష, బావం గలిగిన రచనలు ఎల్లకాలం నిలుస్తాయన్నారు. యువత సాహిత్యం వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాసాప అధ్యక్షులు ఎన్నవెళ్ళి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, కోణం పర్శరాములు, బస్వ రాజ్ కుమార్, చీకోటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై రాద్ధాంతం తగదు

-కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడం మానుకోవాలని, తెలంగాణ తల్లి విగ్రహంపై రాద్ధాంతం తగదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పదేండ్లు బీఆర్ఎస్ పాలనలో చేయలేని పనులను ఏడాదిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఏడదీ పాలనపై ప్రజలను తప్పుదో పట్టించేలా మాట్లాడడం బాధాకరం అని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరింత హుందాగా వ్యవహరించాలని కోరారు. ఇకనైనా మాట్లాడే ముందు జాగ్రత్తగా మాట్లాడాలని, ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకొని బాధ్యతగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యదరి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, కిషన్, బాబా, నజ్జు ఫయాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేయమంటే.. రాద్ధాంతం సిగ్గుచేటు

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కనగండ్ల తిరుపతి ఆరోపణ
- దిలావర్ పూర్ వలే ఇథానాల్ పరిశ్రమలను రద్దు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి



స్థానిక ప్రజల భవిష్యత్తుకు ముప్పుగా మారనున్న మండలంలోని ఇథానాల్ పరిశ్రమలను ప్రభుత్వం దిలావర్‌పూర్ పరిశ్రమలవలే రద్దు చేయమంటే..స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ రాద్ధాంతం చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కనగండ్ల తిరుపతి ఆరోపించారు. మండలంలోని గుగ్గిల్ల, పోతారం శివారు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇథానాల్ పరిశ్రమలను ప్రభుత్వం బేషరుతుగా రద్దు చేసి ప్రజా సంక్షేమ ప్రభుత్వమని చిత్తశుద్దిని చాటాలని స్థానిక అధికార పార్టీ నాయకులకు ఆదివారం ఆయన సవాల్ చేశారు. మండలంలోని ఇథానాల్ పరిశ్రమల నిర్మాణాలు మంత్రి,ఎమ్మెల్యే అనుచరుల కనుసన్నలలో జరుగుతున్నాయని ప్రజలే స్వయంగా చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మండలంలోని ఇథానాల్ పరిశ్రమలను రద్దు చేయాలని..లేనిపక్షంలో ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ అధ్వర్యంలో పోరాటాలు చేపడుతామని ప్రభుత్వాన్ని తిరుపతి డిమాండ్ చేశారు.

రైతులకు ట్రాఫిక్ కష్టాలు

- కాళ్లు పెడితే.. తీయరాని వైనం
- అధికారులు స్పందిస్తే రైతులకు మేలు







నవతెలంగాణ-గజ్వేల్

ములుగు మండలం వంటిమామిడి వ్యవసాయ మార్కెట్లో రైతులు తీసుకపోయే కూరగాయలు క్రయవిక్రయాలు చేసుకోవాలంటే వారు ఇబ్బందులు గురవుతున్నారు. చిరు వ్యాపారులు అక్కడి నుంచి కొనుగోలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించుకుంటారు. మార్కెట్‌కు చిన్న ముఖద్వారం ఉండడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడి అడుగున వాహనాలు నిలిచిపోయి మార్కెట్లోకి కాలినడకగా వెళ్లిన కాలు పెడితే కాలు తీయరాని పరిస్థితి ఉంటుంది. మార్కెట్ లోపలికి వెళ్లాలంటే రాజీవ్ రహదారి రోడ్డు దాటి వెళ్లాలి దీంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక రైతులు, అక్కడికి వచ్చే వ్యాపారులు అంటున్నారు. జోరుగా క్రయవిక్రయలు జరుగుతుండటంతో సమీపంలో ఉన్న ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కూరగాయలు వంటిమామిడి మార్కెట్‌కు తరలివస్తాయి. అందువలన రైతులు స్వయంగా విక్రయించుకుంటున్న నేపథ్యంలో స్థానిక అధికారులు వారి సమస్యలను పట్టించుకోలని ప్రజలు వాపోతున్నారు. అక్కడికి చేరుకుంటున్నాయి. కరీంనగర్, హైదరాబాద్ మార్గమధ్యన ఈ మార్కెట్ ఉండటం వల్ల వందలాది వాహనాలు కూరగాయలతో మార్కెట్ వెళ్లే మూలంగా రోడ్డుపైనే ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి. పలు రకాల కూరగాయలను, ఆకుకూరలు విక్రయిస్తున్నారు. వంటిమామిడి మార్కెట్లో కొనుగోలు చేసి హైదరాబాద్ మోండా మార్కెట్, అల్వాల మార్కెట్‌కు వ్యాపారాలు తీసుకుపోయి విక్రయించుకుంటున్నారు.

ఇది చేస్తే సమస్య పరిష్కారం

ఒంటిమామిడి మార్కెట్‌కు వచ్చే కూరగాయల వాహనాలను లోపలికి ఒక దారి ఉంటే బయటకు మరో దారి ఉంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు. మార్కెట్లో ఉన్న అధికారులు సిబ్బంది చొరువ చూపుతే దీంతో కొంత ఇబ్బందులు రైతులకు తప్పుతాయి. మార్కెట్ శాఖ అధికారులు, ఇబ్బంది దృష్టి సారిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

-లోపలికి వెళ్లాలంటే కష్టంగా ఉంది.



ఒంటిమామిడి మార్కెట్‌కు కూరగా యలు తీసుకపోవాలంటే కష్టంగా ఉంది. మార్కెట్ లోపలికి వెళ్లాలంటే, బయటకు రావాలంటే కష్టంగా ఉంది. అక్కడ పోలీసులు ఉండటం వల్ల కొంత ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. మార్కెట్ శాఖ అధికారులు కూడా దృష్టి పెడితే రెండు ముఖద్వారాల ద్వారా రాకపోకలు సాగించాలి.

- రైతు కిష్టయ్య. సంగుపల్లి.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.



ఒంటిమామిడి మార్కెటుకు కూరగా యలను, ఆకుకూరలను తీసుకపోతే ఇబ్బందులు పడుతున్నాం. రెండు ముఖ ద్వారాలు ఉన్నాయి. ఒక ముఖద్వారం ద్వారా లోపలికి అనుమతించాలి. మరో ముఖద్వారం ద్వారా బయటకు పంపాలి. దీంతో రైతులకు ఇబ్బందులు ఉండవు. అధికారులు దృష్టి పెట్టాలి.

-రైతు నర్సింలు. టెంకంపేట.

ఆందోల్‌లో మంత్రి పర్యటన

- పర్యటనలో పలు విద్యా సంస్థల సందర్శన



నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ మండలంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా పలు విద్యా సంస్థలను సందర్శించారు. మొదట ఆందోల్‌లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూళ్లను, పుల్కల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అనంతరం ఆయా విద్యా సంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను, కిచెన్‌లో ఉన్న ఆహార సామాగ్రిని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మంత్రి మాట్లాడి, అక్కడి సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని అధికారులకు సూచించారు. భోజనం విషయంలో ఏదైనా తప్పు జరిగితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చలికాలం నేపథ్యంలో స్టూడెంట్స్‌కు సరిపడా దుప్పట్లు అందజేయాలని, హాస్టల్ కిటికీలు పగిలిపోయినవి ఉంటే వెంటనే రిపేర్ చేయించాలని ఆదేశించారు. ఇంకేవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచిం చారు. అన్ని విద్యా సంస్థల చుట్టూ కాంపౌండ్ వాల్స్ నిర్మిస్తున్నామని, నీటి, కరెంట్ సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇంటర్నల్ రోడ్లు, గ్రౌండ్, లైబ్రరీ వంటి అన్ని సదుపాయాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.

పర్యాటక ప్రాంతంగా సింగూరు

విద్యాసంస్థల సందర్శన అనంతరం సింగూరు ప్రాజెక్ట్‌ను మంత్రి సందర్శించారు. సింగూర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తద్వారా ఈ ప్రాంత వాసులకు ఆహ్లాదంతో పాటు, పర్యాటకులతో ఉపాధి కూడా దొరుకుతుందన్నారు. ఆయన వెంట రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ మల్లయ్య, మాజీ వార్డు సభ్యులు పట్లోళ్ల ప్రవీణ్, సంగమేష్ గౌడ్, ఉప తహసీల్దార్ మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట డివిజన్ యూఈఈయూ నూతన కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-సిద్దిపేట

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిద్దిపేట డివిజన్ నాలుగో మహాసభ సీఐటీయూ ఆఫీసులో ఆదివారం జరిగింది. మహాసభలో ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు చంద్ర రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటం మధు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంటుపల్లి సధాకర్, జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా కోశాధికారి నాగేందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. డివిజన్ నూతన కమిటీ అధ్యక్షుడుగా పి. కరుణాకర్, కార్యదర్శిగా కె కనకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెట్యూరి సుధాకర్, జక్కుల సత్యం, కోశాధికారిగా రాజనరసింహ రెడ్డి, ముఖ్య కమిటీని ఎన్నుకున్నారు.

కానిస్టేబుళ్ల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేటకు చెందిన ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్ పరందాములు (పెద్దకోడూరు), వెంకటేశ్వర్లు (గాడిచెర్లపల్లి) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మృతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన సంతాపాన్ని తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పోలీస్ ఉద్యోగంలో నిబద్దత కలిగిన యువ కానిస్టేబుల్స్ మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగులగా కాకుండా సామాజిక సేవకులుగా, వీరు యువకులకు ఎంతో స్ఫూర్తి నిచ్చారని, సిద్దిపేటలో జరిగిన హాఫ్ మారతాన్ యువకుల్లో ఎంతో చైతన్యం తెచ్చారని, ఉచిత కానిస్టేబుల్ కోచింగ్, ఇతర సామాజిక సేవల్లో వారు అందించిన సేవలను కొనియాడారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై దాటవేత ధోరణి

- తపస్ రాష్ట్ర కోశాధికారి భాస్కర్ దేశ్

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ, వారి సమస్యలను పరిష్కరించకుండా దాటవేస్తూ కాలం గడుపుతుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారి భాస్కర దేశ్ అన్నారు. స్థానిక శిశుమందిర్ లో జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, వారిని ప్రజా పాలన ఉత్సవాల్లో భాగం చేస్తే బాగుండేదన్నారు. జీవో 317 సమస్య పట్ల పాత జీవోలనే ఇచ్చి వారిని నిరాశపర్చారన్నారు. దీనిపై మంత్రివర్గ ఉప సంఘాన్ని వేస్తే వారి సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపలేకపోయిం దన్నారు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులపై చూపెడుతున్న అలసత్వానికి వ్యతిరేకంగా ఈనెల 17న ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మద్దతును తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, రాష్ట్ర బాధ్యులు తిరుపతి, జనార్ధన్, శ్రీనాకర్ రెడ్డి, నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి, శివ జిల్లా బాధ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తాం

- యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మన్నె కృపానందం



నవతెలంగాణ-రాయపోల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అహర్నిశలు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మన్నె కృపానందం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏడాది ప్రజా పాలనలో రాష్ట్రంలో అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు బడుగు బలహీన వర్గాలు, పేద ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలో యూత్ కాంగ్రెస్ సభ్యులు తనను ఉపాధ్యక్షులుగా ఎంపిక చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. తనకు ఆన్లైన్ ద్వారా ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి పదవులు దక్కుతాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు నా ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పాపిగారి నరేశ్

నవతెలంగాణ-నంగునూరు

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దేవులపల్లి పాపిగారి నరేశ్ ,అధికార ప్రతినిధిగా అంజనేయులు, ఉపాధ్యక్షులుగా దేవులపల్లి శ్రీకాంత్, దేవులపల్లి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా విష్ణు, కార్యదర్శులుగా కొంకటి మల్లేశ్, దేవులపల్లి కిషన్, కోశాధికారిగా దేవులపల్లి నవీన్, ప్రచార కార్యదర్శిగా పాపిగారి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా బొక్కల శివ, దేవులపల్లి శ్రీకాంత్, దేవులపల్లి చింటూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు చివరి దశలో ఉన్న ఎమ్మార్పీఎస్ ఏబీసీడీ వర్గీకరణకు మాదిగలంతా ఏకమై ఎప్పుడు పిలుపునిచ్చిన అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. నరేష్ మాట్లాడుతూ నాకు ఇచ్చిన గ్రామ కమిటీ అధ్యక్ష పదవిని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సక్రమంగా ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమ బలోపేతానికి మాదిగల హక్కుల కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ అధ్యక్షుడు దేవులపల్లి బాలరాజు, అధికార ప్రతినిధి పల్లాటి రాజు, ఎంఎస్పీ అధికార ప్రతినిధి దేవులపల్లి శంకర్,సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



జూడో పోటీలకు రాష్ట్ర కోచ్‌గా చామంతుల భరత్



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన చామంతుల భరత్ ఎస్‌జీఎఫ్ అండర్ 17 తెలంగాణ బాలికల టీం కోచ్‌గా నియమించినట్లు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. భరత్ పంజాబ్‌లోని పటియాలలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో జూడో క్రీడలో ప్రత్యేక శిక్షణ తీసుకొని, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాకారులను తనదైన పద్ధతిలో శిక్షణ ఇచ్చి అనుభవం ఉన్నందున ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. త్రిపుర రాష్ట్రం అగర్తలలో డిసెంబర్ 12 నుంచి 15వరకు జరిగే ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలికల జాతీయస్థాయి జూడో పోటీలకు తెలంగాణ టీం కోచ్‌గా చామంతుల భరత్ ఎంపిక పట్ల సిద్దిపేట జూడో క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, సిద్దిపేట జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షులు నంట శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భరత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.